క్లుప్తంగా

వైద్య సేవలు సద్వినియోగం చేసుకోవాలి



వైద్య శిబిరంలో మాట్లాడుతున్న జడ్జి రహంతుల్లా

ముమ్మిడివరం: మండల స్థాయిలో ఏర్పాటు చేసిన హెల్త్ సెంటర్లలో వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మండల లీగల్ సర్వీస్ కమిటీ చైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి మహమ్మద్ రహంతుల్లా పేర్కొన్నారు. ముమ్మిడివరం మండల పరిధిలో ఠానేల్లంక గ్రామ సచివాలయంలో శనివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు. హెల్త్ సెంటర్లలో వైద్య పరీక్షలతో పాటు అవసరమైన వారికి మందులు సైతం ఉచితంగా ఇస్తారన్నారు. కార్యక్రమంలో దాసరి సత్యనారాయణ, కాశి సిద్దార్థకుమార్, జిల్లా మెడికల్ నోడల్ ఆఫీసర్ డా.సుమలత, డా.మణి, ఎస్ఐ డి.సురేష్‌బాబు, ఎం.శ్రీలక్ష్మి, పి.మేఘన, కె.విజయ్, ఆశా వర్కర్లు, వైద్యారోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉచితంగా పశువుల దాణా అందజేత



కొత్తలంకలో పశువుల దాణా అందజేస్తున్న జేడీ సూర్యప్రకాశరావు తదితరులు

తాళ్లరేవు: గోదావరి వరద ప్రభావిత ప్రాంతాల్లో పశు సంవర్ధక శాఖ అధికారులు శనివారం ఉచితంగా పశువుల దాణాను అందజేశారు. మండల పరిధిలోని పిల్లంక పంచాయతీ శివారు కొత్తలంక గ్రామంలో జరిగిన కార్యక్రమంలో పశు సంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ ఎస్.సూర్యప్రకాశరావు రైతులకు దాణా బస్తాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరదల వల్ల పశుగ్రాసం లేక ఇబ్బందులు పడుతున్న పశువులకు వారం రోజులకు సరిపడే పశు దాణా అందజేసినట్లు తెలిపారు. తాళ్లరేవు మండలంలో 15 టన్నులు, కాజులూరు మండలం పెదలంకలో 10 టన్నుల దాణా ఇచ్చామన్నారు. కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ ఏడీ డి.బ్రహ్మవేద, పశు వైద్యులు దవులూరి సుధ, ఎస్.రమణమూర్తి, చింతా శ్రీను, పశు వైద్య సహాయకులు పాల్గొన్నారు.

వెంకన్నకు ఊయల సేవ



స్వామి, అమ్మవార్లకు ఊయల సేవ నిర్వహిస్తున్న భక్తులు

అమలాపురం టౌన్: స్థానిక వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం సాయంత్రం స్వామి, అమ్మవార్లకు మట్టపర్తి పురుషోత్తంరాజు, సీతారత్నం దంపతులు ఊయల సేవ ఘనంగా నిర్వహించారు. స్వామికి ప్రీతిపాత్రమైన రోజు కావడంతో శనివారం స్వామి దర్శనానికి వేలాది మంది భక్తులు బారులు తీరారు. అర్చకులు ప్రతీ వారం నిర్వహించే సుదర్శన హోమాన్ని భక్తులు తిలకించి తరించారు. అన్నదాన కార్యక్రమంలో వందలాది మంది భక్తులు పాల్గొని స్వామి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. స్వామి వారికి స్వీటు ప్రసాదాన్ని పట్టణానికి చెందిన దాతలు జంగా ఏసుబాబు, శ్రీవల్లి దంపతులు, యెండూరి నాగేశ్వరరావు, రాఘవ దంపతులు, నంద్యాల గోపాలకృష్ణ, దుర్గామణి దంపతులు సమకూర్చారు. దేవస్థానం ఈవో దూనబోయిన సాయిబాబు ఆధ్వర్యంలో సిబ్బంది భక్తులకు సేవలు అందించారు.

కేరళ బాధితుల కోసం సహాయ నిధి సేకరణ



వయనాడ్ బాధితుల కోసం సహాయ నిధి సేకరిస్తున్న సీపీఎం నాయకులు

అమలాపురం టౌన్: కేరళ రాష్ట్రం వయనాడ్ ప్రాంతంలో కొండ చరియలు విరిగిపడిన ఘటనలో బాధితుల కోసం జిల్లా సీపీఎం శాఖ సహాయ నిధి సేకరణ చేపట్టింది. పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు రమాదేవి, పార్టీ జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావుతో పాటు పలు ప్రజా సంఘాల ప్రతినిధులు పట్టణంలోని పలు రోడ్లలో సహాయ నిధిని శనివారం సేకరించారు. పట్టణంలోని కె.అగ్రహారం, బ్యాంక్ స్ట్రీట్, గడియారం స్తంభం సెంటరులోని దుకాణదారులు, చిరు వ్యాపారులు, బ్యాంక్‌లు, వాహన చోదకుల నుంచి జోలి పట్టి విరాళాలను సేకరించారు. రూ.10,538 విరాళాల ద్వారా సేకరించామని పార్టీ జిల్లా కన్వీనర్ వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ సహాయ నిధిని కేరళ బాధితులకు పంపిస్తామని చెప్పారు. సహాయ నిధి సేకరణలో పార్టీ నాయకులు ఎస్.బలరామ్, జి.దుర్గా ప్రసాద్, కె.కృష్ణవేణి, టి.నాగ వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ముంపు వీడదు.. సాగు సాగదు

- వరద తగ్గినా ముంపులోనే నారుమడులు, నాట్లు
- పట్టించుకోని డ్రెయిన్స్ అధికారులు
- పంట విరామం దిశగా అన్నదాతలు



ఉప్పలగుప్తంలో చెరువును తలపిస్తున్న చేలు



భట్టుపాలెంలో నీటిలోనే కుళ్లిపోతున్న నారుమడి

ఉప్పలగుప్తం: పూర్వం మూడు పంటలు పండించే అన్నదాతలు ప్రకృతి వైపరీత్యాల కారణంగా ప్రస్తుతం తొలకరి సాగు చేయడానికే భయపడుతున్నారు. ఏటా వరదలు, తుపాన్లు, భారీ వర్షాలతో ఆరుగాలం కష్టపడి పండించిన పంట నేలపాలవుతుంటే కన్నీరుమున్నీరవుతన్నారు. ఏటా తొలకరి పంట తమకు నిరాశే ఎదురవుతుందని రైతులు ఖరీఫ్‌కు విరామం ప్రకటించేవారు. అయితే గత రెండేళ్లుగా ఖరీఫ్ సాగులో పెద్దగా వర్షాలు లేకపోవటంతో ఈ ఏడాది తొలకరి సాగుకు ముందుకొచ్చారు. అయితే గోదావరి వరద, ఎడతెరపి లేని వర్షాల కారణంగా అప్పులు తెచ్చి మరీ వేసుకున్న నారుమడులు, నాట్లు నీట మునగడంతో అన్నదాతలకు తీవ్ర నష్టం జరిగింది. వరద తగ్గినా మేజర్, మీడియం, మైనర్, రెవెన్యూ డ్రెయిన్లలో నీరు రెండు నుంచి మూడు అడుగుల ఎత్తు ఉండడంతో వరి చేలల్లో నీరు దిగే పరిస్థితి కనిపించడం లేదు.

నీరు దిగేదెపుడు.. మళ్లీ నారు పోసేదెపుడు

అమలాపురం నియోజకవర్గంలోని అల్లవరం, ఉప్పలగుప్తం, అమలాపురం మండలాల్లో 13,846 ఎకరాల్లో సాగు చేయాల్సి ఉండగా 8,165 ఎకరాల్లో చేపట్టారు. వాటిలో 716 ఎకరాలు నాట్లు వేసిన చేలు, 324 ఎకరాల నారు మడులు నీట మునిగాయని ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. రోజుల తరబడి నీరు నిలిచిపోవడంతో ముంపు పొలాల్లో నారు, నాట్లు కుళ్లిపోతున్నాయి. అల్లవరం, ఉప్పలగుప్తం, అమలాపురం మండలాల్లో ప్రధానంగా రామేశ్వరం మొగ, కూనవరం మేజర్ డ్రెయిన్‌లకు అనుసంధానంగా ఉన్న డ్రెయిన్‌ల సహాయంతో ముంపు నీరు సముద్రానికి చేరుతుంది. ఇటీవల రామేశ్వరం మొగను అధికారులు ఆధునీకరించారు. కూనవరం మొగ ప్రాంతాన్ని గత నాలుగు రోజులుగా తవ్వకాలు చేపట్టారు. అయినా ఈ మొగ తవ్వకాల పనులు పూర్తవడానికి మరో వారం రోజులు పట్టే అవకాశం ఉందని రైతులు వాపోతున్నారు. ఇదిలా ఉంటే గ్రామాల్లో ఉన్న రెవెన్యూ డ్రెయిన్లు పూడికలతో మూసుకుపోవడం, అధికారులెవరూ సహకరించకపోవడంతో ఈ ఏడాది సాగుకు గట్టి దెబ్బ తగిలింది. పంట చేలల్లో నీరు దిగేదెపుడు, మళ్లీ నారుమడులు పోసేదెపుడని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆఖరికి స్వల్పకాలిక రకాలైన ఎంటీయూ 1153, 1156, 1293 రకాలను ఎంచుకుని నాట్లు వేయడానికైనా రైతులకు ధైర్యం సరిపోవడం లేదు. పక్క మండలాలు లేదా ఎగువ ప్రాంతాల్లో నారును తీసుకొచ్చి నాట్లు సిద్ధం చేసుకోవాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నా అది జరిగే పని కాదని అన్నదాతలు పెదవి విరుస్తున్నారు. ఇప్పటికే ఎకరాకు రూ.10 నుంచి రూ.12 వేలు ఖర్చు చేశామని పంట విరామం తప్ప తమకు మరో ప్రత్యామ్నాయం లేదని చెబుతున్నారు.

నారు కుళ్లిపోయింది



నాకు ఎనిమిది ఎకరాల వ్యవసాయం ఉంది. దాదాపు రూ.60,000 ఖర్చు చేసి పొలంలో దమ్ము చేసి నారుమడి పోసుకున్నాను. వరద వల్ల నారు మునిగిపోయి కుళ్లిపోయింది. మళ్లీ నారు దొరికే పరిస్థితి లేదు. పంట విరామం తప్ప మరో ప్రత్యామ్నాయం కనిపించడం లేదు.

– కొళ్లపల్లి పట్టాభిరాముడు, రైతు, భీమనపల్లి, ఉప్పలగుప్తం మండలం

డ్రెయిన్స్ అధికారుల నిర్లక్ష్యం



నేను 15 ఎకరాల్లో కౌలుకు వ్యవసాయం చేస్తున్నాను. నారు మడి వేసుకున్నాక వరదకు మునిగిపోయింది. అధికారులు రంగరాజుకోడును ఆధునీకరించారే తప్ప కూనవరం మేజర్ డ్రెయిన్‌ను పట్టించుకోలేదు. కేవలం డ్రెయిన్స్ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ముంపు తగ్గక మా పొలాలు నాలుగు అడుగుల లోతులో ఉండిపోయాయి.

– యాళ్ల లక్ష్మీనారాయణ, రైతు, భీమనపల్లి, ఉప్పలగుప్తం మండలం

స్వల్పకాలిక రకాలు ఎంచుకోవాలి



ప్రస్తుతం చేలల్లో నీరు దిగక రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికే డ్రెయిన్స్ అధికారులకు ఈ సమస్యపై విన్నవించాం. నీట మునిగిన రైతులు నీరు తీసిన తర్వాత స్వల్పకాలిక రకాలను ఎంచుకుని ఖరీఫ్ సాగును కొనసాగించాలి. నీరు పూర్తిగా తీసిన రైతులు ఎకరాకు 20 కేజీల యూరియా, 10 కేజీల పొటాష్ బూస్టర్ డోస్‌గా వేసుకోవాలని,

– జి.కుమార్‌బాబు, వ్యవసాయాధికారి, ఉప్పలగుప్తం

వరద బాధితులకు పరిహారమేది?

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి రమాదేవి
- వరద ప్రభావిత ప్రాంతంలో సీపీఎం బృందం పర్యటన



బోడసకుర్రు పల్లిపాలెంలో వరద బాధితులతో మాట్లాడుతున్న సీపీఎం బృందం

అల్లవరం: వరద ప్రభావిత ప్రాంతాల్లోని ముంపు బాధితులకు ప్రభుత్వం ప్రకటించిన పరిహారం రూ.3 వేలు అందించకుండా కేవలం బియ్యం, ఉల్లిపాయలు, నూనె ప్యాకెట్లతో సరిపెట్టడం సరికాదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి రమాదేవి అన్నారు. శనివారం బోడసకుర్రు పల్లిపాలెంలోని వరద ప్రభావిత ప్రాంతాన్ని సీపీఎం బృంద సభ్యులు సందర్శించి బాధితులతో మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేటపై జీవనం సాగిస్తున్న మత్స్యకారులకు వేట నిషేధ సమయంలో ఇవ్వవలసిన మత్స్యకార భరోసా ప్రభుత్వం నేటికి ఇవ్వకపోవడం దారుణమన్నారు. తక్షణమే మత్స్యకార భరోసాను విడుదల చేయాలని, అలాగే ఒక్కో వరద బాధిత కుటుంబానికి రూ.10 వేలు పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఏటా వరదల కారణంగా పల్లిపాలెంలోని ఇళ్ల వరద ముంపు బారిన పడుతున్నారని, వరద నీరు రాకుండా పల్లిపాలెం పొడవునా కాంక్రీట్ గోడ నిర్మిస్తే ముంపునకు శాశ్వత పరిష్కారం ఉంటుందన్నారు.

పల్లిపాలెంలో తుఫాన్ పునరావాస కేంద్రాన్ని, కుమ్మరి కాలువ పొంగకుండా ఉండేందుకు రెండు స్లూయిజ్‌లు నిర్మించాలని కోరారు. వరద వల్ల పాక్షికంగా దెబ్బతిన్న ఇళ్లు కూలిపోయేందుకు సిద్ధంగా ఉన్నాయని, వారికి ప్రభుత్వమే ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. వరద బాధితులకు సీపీఎం పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఆండ్ర మల్యాద్రి, జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు, బలరామ్, దుర్గాప్రసాద్, కృష్ణవేణి, పీతల రామచంద్రరావు, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గౌరీశంకర్



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గౌరీశంకర్

అమలాపురం టౌన్: మాదక ద్రవ్యాలను వాడడం వల్ల అనేక అనర్థాలు ఎదురవుతాయని, అందుకే విద్యార్థులు వాటికి దూరంగా ఉండాలని అమలాపురం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వి.గౌరీశంకర్ అన్నారు. మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ఆదిత్య జూనియర్ కళాశాలలో శనివారం జరిగిన న్యాయ విజ్ఞాన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. మంచి స్నేహితులతో ఆరోగ్యకరమైన సమాజాన్ని ఆవిష్కరించాలని ఆయన విద్యార్థులకు సూచించారు. ఈ సందర్భంగా పట్టణ ఎస్ఐ కిషోర్‌బాబు మాదక ద్రవ్యాల వాడకం వల్ల నమోదు చేసే సెక్షన్లు, కేసులు, వాటి శిక్షలు గురించి అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ పీఎస్‌వీఎస్ చలపతిరావు, న్యాయవాదులు వీకేఎస్ భాస్కర శాస్త్రి, కుంచే శ్రీనివాసరావు, కముజు శ్రీనివాసరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

అర్ధ శతాబ్దం తరువాత ఆత్మీయ కలయిక



ఆత్మీయ కలయికకు హాజరైన అమలాపురం జిల్లా పరిషత్ పాఠశాల 1974-75 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు

అమలాపురం టౌన్: స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో 1974–75లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులంతా అర్ధ శతాబ్దం తరువాత ఆత్మీయ కలయిక ఏర్పాటు చేసుకున్నారు. 50 ఏళ్ల క్రితం చిగురించిన తమ స్నేహానికి గుర్తుగా శనివారం ఒకే వేదికపై కలుసుకున్నారు. నాడు కలిసి చదువుకున్న దాదాపు 100 మంది బాల్యమిత్రులు స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్‌లోని లియోనియా హోలిస్టిక్ డెస్టినేషన్‌లో శనివారం కలుసుకుని సంబరాలు చేసుకున్నారు. వారిలో మూడొంతుల మంది విశ్రాంత ఉద్యోగులే కావడం విశేషం. తమ వృత్తి, ప్రవృత్తులను పక్కన పెట్టి మళ్లీ వారంతా బాల్యంలోకి వెళ్లిపోయారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని రోజంతా ఆనంద డోలికల్లో తేలియాడారు. సహ పంక్తి భోజనాలు చేసి తమ ఆత్మీయతను చాటుకున్నారు. చివరిగా ఓ గ్రూపు ఫొటో దిగి తమ జ్ఞాపకాలను పదిలం చేసుకున్నారు.

స్కూళ్ల పని వేళల్లో మార్పులు

యానాం: పుదుచ్చేరి వ్యాప్తంగా యానాంతో సహా నాలుగు రీజియన్లలోనూ సీబీఎస్ఈ సిలబస్‌ను అమలు చేస్తున్న నేపథ్యంలో దానికి అనుగుణంగా స్కూల్స్ పని వేళలు సవరిస్తూ రాష్ట్ర విద్యా శాఖ డైరెక్టర్ శనివారం ఆదేశాలు జారీ చేశారు. ఈ నెల 7వ తేదీ నుంచి రోజూ ఉదయం 9.15 గంటలకు స్కూల్ ప్రారంభమవుతుందని 9.30 వరకు ప్రార్థన ఉంటుందన్నారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.40 గంటల వరకూ నాలుగు పీరియడ్లు జరుగుతాయన్నారు. మధ్యాహ్నం 12.40 గంటల నుంచి 1.30 గంటల వరకూ లంచ్ బ్రేక్ ఉంటుందన్నారు. అనంతరం 1.30 గంటల నుంచి సాయంత్రం 4.20 గంటల వరకూ తరగతులు జరుగుతాయన్నారు.

రాజప్ప పరామర్శ

ముమ్మిడివరం: చినకొత్తలంక మాజీ సర్పంచ్ పొత్తూరి విజయ భాస్కర వర్మ గురువారం మృతి చెందారు. వర్మ కుటుంబ సభ్యులను పెద్దాపురం ఎమ్మెల్యే మాజీ హోంమంత్రి నిమ్మకాయల చినరాజప్ప శనివారం పరామర్శించి తన సానుభూతిని వ్యక్తం చేశారు.

పుస్తక పఠనంతో సృజనాత్మకత



మహాలక్ష్మిని సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ కుమారశాస్త్రి

అమలాపురం రూరల్: పుస్తక పఠనంతో సృజనాత్మకత, ఆలోచన శక్తి పెంపొందుతాయని హైదరాబాద్‌కు చెందిన విద్యా నిపుణురాలు గొర్తి మహాలక్ష్మి అన్నారు. అమలాపురం ఎస్‌కేబీఆర్ కళాశాలలో పూర్వ విద్యార్థుల సంఘం, గ్రంథాలయశాఖ ఆధ్వర్యంలో పుస్తక పఠనం వల్ల కలిగే ప్రయోజనాలు అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఎస్వీ కుమారశాస్త్రి మాట్లాడుతూ విద్యార్థులు ఎలక్ట్రానిక్ గాడ్జెట్లకు బదులు పుస్తక పఠనంపై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా మహాలక్ష్మిని ప్రిన్సిపాల్ కుమారశాస్త్రి సత్కరించారు. కార్యక్రమంలో గ్రంథాలయ విభాగం ఉద్యోగులు ఎ.శర్మ, నక్క రాజకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగునికి వీల్‌చైర్ బహూకరణ



దివ్యాంగునికి వీల్‌చైర్ బహూకరించిన లోకేష్

తాళ్లరేవు: మండలంలోని గాడిమొగ గ్రామ పంచాయతీ గోపాలపురం గ్రామానికి చెందిన దివ్యాంగుడు మేడపాటి బాబురావుకు ఉపసర్పంచ్ కొక్కిలగడ్డ లోకేష్ వీల్‌చైర్‌ను శనివారం బహూకరించారు. బాబురావుకు మానవతా దృక్పథంతో వీల్‌చైర్‌ను అందించినట్లు లోకేష్ తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ఎంపీటీసీ సభ్యుడు సీహెచ్ కామేశ్వరరావు, వార్డు సభ్యురాలు అనంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ



విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేస్తున్న ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు

అమలాపురం టౌన్: స్థానిక కొంకాపల్లిలోని జవహర్‌లాల్ నెహ్రూ మున్సిపల్ ఉన్నత పాఠశాలను ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు శనివారం సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తరగతి గదులకు వెళ్లి విద్యార్థులతో మమేకమై ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. అనంతరం ఆయన విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.ఘన సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు ఎమ్మెల్యే పరామర్శ



బాధితులకు నిత్యావసర సరకులు అందిస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు

ఉప్పలగుప్తం: మండలంలోని చినగాడవిల్లి, మునిపల్లి గ్రామాల్లో జరిగిన అగ్ని ప్రమాదంలో రెండు తాటాకిళ్లు దగ్ధమై రెండు కుటుంబాలు కట్టుబట్టలతో మిగిలాయి. బాధితులు పెనుమాల వెంకటేశ్వరరావు, తిరుకోటి సురేష్ కుటుంబాలను ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు శనివారం పరామర్శించి బియ్యం, నిత్యావసర సరకులు అందజేశారు. కార్యక్రమంలో దేశంశెట్టి లక్ష్మీనారాయణ, అరిగెల నానాజీ, యాళ్ల సత్తిబాబు, గుర్రాల ప్రసాద్ తదితరులు ఉన్నారు.

ఉద్యాన పంటలకు వరద పోటు



కొత్తలంకలో గోదావరి వరద ప్రారంభంలో వంగ తోట (నాడు)



వరద తగ్గినా పూర్తిగా పాడైన వంగతోట(నేడు)

తాళ్లరేవు: గోదావరి వరదల కారణంగా గత వారం రోజులుగా గౌతమి నది ఉధృతంగా ప్రవహించడంతో లంక గ్రామాల్లో ఉద్యాన పంటలు బాగా దెబ్బతిన్నాయి. మండల పరిధిలోని పిల్లంక పంచాయతీ కొత్తలంక గ్రామంలో సాగు చేసిన కాయగూరల తోటలన్నీ ముంపునకు గురయ్యాయి. ప్రస్తుతం వరద ప్రభావం తగ్గి ఆయా పంటలు ముంపు బారి నుంచి బయట పడుతున్నా కుళ్లిపోయి ఎందుకూ కొరగాకుండా పోయాయి. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం నష్ట పరిహారం అందించి తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. వ్యవసాయ అధికారుల ప్రాథమిక అంచనా ప్రకారం ఒక్క కొత్తలంక గ్రామంలోనే సుమారు 12 ఎకరాల్లో కాయగూరలు, సుమారు 4 ఎకరాల్లో అరటి, బొప్పాయి పంటకు నష్టం సంభవించినట్లు ఉద్యానవన అధికారి శైలజ చెబుతున్నారు.

చేతివృత్తుల సంఘం ఆవిర్భావ దినోత్సవం



కార్మిక జెండా ఆవిష్కరించిన చేతివృత్తుల సంఘం ప్రతినిధులు

అమలాపురం టౌన్: జిల్లా దుర్గా మల్లేశ్వర సాయి చేతివృత్తుల కార్పెంటర్ సంఘం 16వ ఆవిర్భావ దినోత్సవాన్ని స్థానిక ఎస్‌కేబీఆర్ కళాశాల సమీపంలోని సంఘ కార్యాలయం వద్ద శనివారం ఘనంగా నిర్వహించారు. జిల్లా సంఘం అధ్యక్షుడు దేవాదుల సూర్యనారాయణమూర్తి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని తొలుత కార్మిక జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన జిల్లాలోని చేతి వృత్తులకు సంబంధించిన కార్మికులందరికీ సంఘ ఆవిర్భావ శుభాకాంక్షలను తెలియజేశారు. సూర్యనారాయమూర్తి మాట్లాడుతూ 50 ఏళ్లు నిండిన కార్పెంటర్లకు చేతి వృత్తుల కార్మిక పింఛన్ ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దంగేటి రామకృష్ణ, పితాని బేబీరావు, కుసుమే నరసింహారావు, కందాల సూర్యనారాయణ, కొప్పిశెట్టి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ టీచర్ల సమస్యలను పరిష్కరించాలి



డీవైఈవో సూర్య ప్రకాశానికి వినతి పత్రం అందిస్తున్న యూటీఎఫ్ ఉపాధ్యాయులు

అమలాపురం టౌన్: మున్సిపల్ పాఠశాలల ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ పట్టణ యూటీఎఫ్ ఉపాధ్యాయులు డీవైఈవో గుబ్బల సూర్యప్రకాశానికి అమలాపురంలో శనివారం వినతి పత్రం అందించారు. మున్సిపల్ ఉన్నత పాఠశాలల్లో పోస్టులను అప్‌డేట్ చేయాలని, పదోన్నతులు, బదిలీలు జరిపించాలన్నారు. ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుంచి మినహాయించి పని భారం తగ్గించాలని కోరారు. మున్సిపల్ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య(రోల్) పెరిగిన దృష్ట్యా అందుకు అనుగుణంగా సబ్జెక్ట్ టీచర్లను నియమించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పట్టణ యూటీఎఫ్ అధ్యక్షురాలు బి.చంద్రకళ, ప్రధాన కార్యదర్శి కె.పరమేశ్వరరావు, బీఎస్ వెంకటేశ్వరరావు, సీహెచ్ హరిబాబు, ఎస్వీ రమణ, జీవీవీ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

దూర ప్రాంతాల్లో నీట్ పరీక్షా కేంద్రాలు

యానాం: నీట్–పీజీ ప్రవేశ పరీక్షా కేంద్రాలను కోయంబత్తూరులో కేటాయించడంతో యానాం అభ్యర్థులు శనివారం ఆందోళన నిర్వహించారు. యానాం నుంచి సామర్లకోట చేరుకుని అక్కడి నుంచి 1026 కిలోమీటర్లు దూరాన్ని సుమారు 18 గంటల పాటు ప్రయాణం చేసి చేరుకోవాల్సి ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్కొక్కరికి ప్రయాణం, కోయంబత్తూరులో ఉండేందుకు వసతి కోసం వేలాది రూపాయలు ఖర్చవుతాయన్నారు. నీట్ పీజీ ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసేటప్పుడు తాము పుదుచ్చేరి ఆప్షన్ ఇచ్చామని, కాని అవి కాకుండా తమిళనాడు వంటి దూర ప్రాంతాలకు కేటాయించారన్నారు. పరీక్షా కేంద్రం కేటాయింపునపై అభ్యంతరం తెలుపుతూ సంబంధిత నేషనల్ బోర్డు ఆఫ్ ఎగ్జామినేషన్స్, న్యూఢిల్లీ టోల్‌ఫ్రీ నెంబరుకు ఫోన్ చేస్తుంటే స్పందించడం లేదని వాపోయారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ఆర్ఏఓ మునిస్వామికి విజ్ఞప్తి చేశారు.

తీర్పు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం

అమలాపురం రూరల్: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు భారత రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని, రివ్యూ పిటిషన్ వేసి భారత రాజ్యాంగాన్ని రక్షించాలని కోరుతూ జేసీ నిషాంతికి భారత రిపబ్లికన్ పార్టీ జిల్లా అధ్యక్షుడు గిడ్డి జ్ఞానప్రకాష్ శనివారం వినతి పత్రం అందజేశారు.

న్యాయ పోరాటం చేస్తాం

ఎస్సీ, ఎస్టీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై న్యాయ పోరాటం చేస్తామని పీవీ రావు మాలమహానాడు నేతలు స్పష్టం చేశారు. పీవీ రావు మాలమహానాడు ఆధ్వర్యంలో ఈదరపల్లి అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్‌లో శనివారం అత్యవసర సమావేశం నిర్వహించారు. ఇకపై గ్రూపులు విడనాడి ఎస్సీ, ఎస్టీ వర్గీకరణను అడ్డుకోవడమే లక్ష్యంగా పనిచేస్తామని పండు అశోక్ కుమార్, ఎంఏకే భీమారావు, జగడం సత్యనారాయణ, పెయ్యల పరశురాముడు, చీకురుమెల్లి కిరణ్ కుమార్ తదితరులన్నారు.

విద్యార్థినులకు సబ్సిడీపై ఎలక్ట్రిక్ స్కూటర్లు

యానాం: పుదుచ్చేరి వ్యాప్తంగా పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న 500 మంది విద్యార్థినులకు సబ్సిడీపై ఎలక్ట్రిక్ స్కూటర్లు ఇవ్వనున్నట్లు సీఎం రంగసామి శనివారం ప్రకటించారు. ఈ మేరకు బడ్జెట్‌లో ఆదిద్రావిడ శాఖ, ట్రైబల్ వెల్ఫేర్ శాఖ ద్వారా రూ.488 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. రూ.లక్ష విలువజేసే ఎలక్ట్రిక్ స్కూటర్ కొనుగోలుపై 75 శాతం వరకూ సబ్సిడీ ఇస్తామన్నారు. ముఖ్యమంత్రి గ్రామం పథకం ద్వారా 50 శాతం ఎస్సీలు ఉన్న 10 గ్రామాలను దత్తత తీసుకుంటామన్నారు.